క్లుప్తంగా

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్ రావునగర్‌లో వరద ముంపునకు గురైన బాధితులకు నంద్యాల జిల్లా కోయిలకుంట్లకు చెందిన విక్కీ ఫౌండేషన్ నిర్వాహకుడు గోపిరెడ్డి శుక్రవారం కేఎల్‌రావునగర్‌లో వరద ముంపునకు గురైన బాధితులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివకుమార్ పట్నాయక్ సహకారంతో తాము ఈ దుస్తులను పంపిణీ చేశామన్నారు. కేఎల్‌రావు నగర్, వీఎంసీ కాలనీ, అంబేడ్కర్‌నగర్ పరిసరాల్లో ఉన్న కుటుంబాలకు ఈ దుస్తులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్ పట్నాయక్, బద్రీనాథ్, గుర్రం రాంబాబు, కిరణ్‌కుమార్ పట్నాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామాజిక వేడుకలు



పాయకాపురం(విజయవాడరూరల్): సామాజిక వేడుకలలో భాగంగా శుక్రవారం పలు డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక విలువలు కలిగిన ఆహారపదార్థాలపై ఐసీడీఎస్ సిబ్బంది తల్లులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆహారంలో మునగ ఆకు, కరివేపాకు పొడులు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు వీటి ద్వారా లభిస్తాయన్నారు. ఇళ్ల వద్ద కరివేపాకు, మునగ మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.నాగమణి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా సేవలు శ్లాఘనీయం



విజయవాడస్పోర్ట్స్: మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రొఫెసర్ సాయిబాబా చేసిన సేవలు శ్లాఘనీయమని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) కార్యదర్శి అరిగల శివరామప్రసాద్(రాజా) పేర్కొన్నారు. మానవ హక్కుల ఉద్యమకారుడు, విద్యావేత్త, రచయిత జి.ఎన్.సాయిబాబా సంతాపసభను బీబీఏ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ సాయిబాబా చేసిన ఉద్యమాలు, పడిన ఇబ్బందులు, అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం చేసిన పోరాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీబీఏ ఉపాధ్యక్షులు శర్మ, న్యాయవాదులు అయ్యల రాంప్రసాద్, సంపర శ్రీనివాసరావు, విటల్, బూసి సతీష్, అబ్దుల్‌రజాక్, క్లాడియ, చక్రవర్తి, ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం షాపులు వద్దు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం సీతన్నపేట గేటు వద్ద నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామశివను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన విజయవాడ అర్బన్ అధ్యక్షులు గార్లపాటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ బ్రహ్మణులు నివసిస్తున్న జీఎస్ రాజు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు కారణంగా ఈ ప్రాంతంలో తీవ్రఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. గతంలోనూ మందుబాబులు ఈ ప్రాంతంలోని నివాసాల వద్దే బహిరంగంగా మద్యం సేవించడం, ప్రశ్నించిన స్థానికులు, మహిళలపై దాడులకు పాల్పడ్డారని వివరించారు. జనావాసాల మధ్య మద్యం షాపుల ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలన్నారు. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఇంటిపరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యాధికారి డాకర్ సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే...ఆర్‌యూబీ మునకే

- కొద్దిపాటి వర్షానికే సింగ్‌నగర్ ఫ్లైఓవర్ ఆర్‌యూబీ నీటమునక
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు
- సమస్యను పరిష్కరించాలని ప్రజల డిమాండ్



ఆర్‌యూబీ వద్ద వర్షపు నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు



వర్షపునీరు చేరడంతో మొరాయించిన బైకుతో అవస్థలు పడుతున్న వాహనచోదకులు



సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ ఆగినపుడు ఆర్‌యూబీ మార్గంలో ట్రాఫిక్ రద్దీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించేవారికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకూడదనే లక్ష్యంతో సింగ్‌నగర్–రామకృష్ణాపురం మధ్యలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జ్(ఆర్‌యూబీ) మార్గం ప్రయాణికులకు తరచూ అక్కరకు రాకుండా పోతుంది. కొద్దిపాటి వర్షానికే ఇక్కడ వర్షపునీరు నిలిచిపోవడంతో ఆర్‌యూబీ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ పైనే ఆధారపడాల్సి వస్తుండటతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

ట్రాఫిక్ వలయంలో సింగ్‌నగర్..

సింగ్‌నగర్ మీదుగా ఇటు నున్న, నూజివీడు ప్రాంతాలతోపాటు అటు అంబాపురం, జక్కంపూడి, నైనవరం గ్రామాల ప్రజలు విజయవాడ నగరంలోకి ప్రవేశించాలన్నా..అటూఇటూ రాకపోకలు చేయాలన్నా సింగ్‌నగర్ ఫ్లైఓవర్ మీదుగానే రావాల్సి ఉంటుంది. దీంతో వేల వాహనాలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల సంఖ్య అధికమవుతుండడంతో సింగ్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు, ఆటోలు, చిన్న చిన్న కార్లు వెళ్లేలా ఫ్లైఓవర్ పక్కనే ఆర్‌యూబీ మార్గాన్ని గతంలో నిర్మించడంతో ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ సమస్య కాస్త తగ్గుముఖం పట్టింది. సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ఏదైనా ట్రాఫిక్ సమస్య తలెత్తితే ప్రయాణికులందరికి ఇక ఈ ఆర్‌యూబీ మార్గమే శరణ్యమవుతోంది.

తరచూ నీటమునకతో ఇక్కట్లు..

అయితే కొద్దిపాటి వర్షానికే ఆర్‌యూబీలో నిలిచిన నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో వర్షపు నీటి దెబ్బకు ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటోంది. కొంతమంది ప్రయాణికులు చుట్టూ తిరిగి వెళ్లలేక ఈ నీటిలో నుంచే ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో వర్షపునీరు దెబ్బకు వాహనాలు మరమ్మతులకు గురవుతున్న ఘటనలు ఇక్కడ తరచూ కనిపిస్తున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి..

సింగ్‌నగర్ ఫ్లైఓవర్ మీదుగా వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటే ఈ ఆర్‌యూబీ మార్గంలో కూడా నిత్యం వందల సంఖ్యలో వాహనచోదకులు ప్రయాణిస్తుంటారు. వర్షాల కారణంగా ఆర్‌యూబీ మార్గంలో రాకపోకలకు ఏమాత్రం అంతరాయం ఏర్పడిన ఇక సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై గంటల తరబడి ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతుంటాయి. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు ఆర్‌యూబీలో ఆగిన వర్షపు నీటిని మోటార్ల సాయంతో తొలగించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, వర్షపు నీరు ఆగకుండా శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరించేందుకు మాత్రం చర్యలు చేపట్టడం లేదని వాహనచోదకులు చెబుతున్నారు. ప్రయాణికుల అవసరాలు, ఇబ్బందులను గుర్తించి సంబంధిత ఉన్నతాధికారులు ఆర్‌యూబీ మార్గంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బండ్లు పాడైపోతున్నాయి..



సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుండటంతో ఆర్‌యూబీ మార్గం ద్వారా ప్రయాణం చేస్తుంటాము. కానీ చిన్న వర్షం పడినా ఇందులో మోకాళ్ల లోతులో నీళ్లు ఆగిపోతున్నాయి. నీటిలో నుంచి వెళ్తుండటంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.

రబ్బాని, సింగ్‌నగర్

సమస్యను పరిష్కరించాలి..



సింగ్‌నగర్ ఆర్‌యూబీ మార్గాన్ని చిన్నపాటి వర్షానికే నిలిపివేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడాల్సి వస్తోంది. ఆర్‌యూబీ మార్గం వద్ద నిలిచిపోతున్న వర్షపునీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన త్వరగా పరిష్కరించాలి.

–సురేష్, మధురానగర్

20నుంచి ఘంటసాల చైతన్య వేదిక జాతీయ మహాసభలు

విజయవాడ కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 20, 21వ తేదీల్లో ఘంటసాల చైతన్య వేదిక 13 జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి ప్రతినిధులు పాల్గొంటారని ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఘంటసాల విగ్రహంతోపాటు తెలుగు తేజోమూర్తుల స్మృతిచిహ్నాలను ఏర్పాటు చేసే దిశగా కార్యచరణ సమావేశం ఉంటుందని వివరించారు. ఘంటసాల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమన్వయకర్త చిట్టిబాబు మాట్లాడుతూ ప్రముఖ గాయనీగాయకులు స్వరాలాపన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బోడి ఆంజనేయరాజు, కె.డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురికావడంతో తీవ్రంగా గాయపడిన ఓవ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందారు. నున్న పోలీసుల కథనం మేరకు కండ్రికకు చెందిన లారీడ్రైవరు వర్రి వెంకట్రావ్ గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ప్రశాంతినగర్ నుంచి ఇంటికి వెళ్తూ లగడపాటి రాజగోపాల్ కల్యాణ మండపం వద్ద బైక్ స్కిడ్‌అయి ప్రమాదానికి గురయ్యారు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రోన్ షో బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



పున్నమిఘాట్‌లో ఏర్పాట్లకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22, 23 తేదీలలో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో డ్రోన్ సమ్మిట్–2024 నిర్వహించనుంది. అందులో భాగంగా 22వ తేదీ సాయంత్రం భవానీపురం పున్నమిఘాట్ (బబ్బూరి గ్రౌండ్)లో నిర్వహించనున్న డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు శుక్రవారం ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. పున్నమిఘాట్, భవానీఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించి వీఐపీ గ్యాలరీతోపాటు పబ్లిక్ గ్యాలరీ తదితర గ్యాలరీల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవల్సిన భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమానికి హాజరయ్యే డెలిగేట్స్, వీవీఐపీలు, సామాన్య ప్రజలు డ్రోన్ షో, సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారి వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పటిష్ట బందోబస్తు నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధురానగర్ ఆర్‌యూబీ ప్రారంభం



ఆర్‌యూబీని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, బోండా ఉమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. స్థానిక మధురానగర్‌లో నిర్మించిన ఆర్‌యూబీని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గంలో వీఎంసీ రైల్వేవారితో అనుసంధానంగా ఉన్న చాలా పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఆ పనులు వెంటనే పూర్తి చేసేందుకు వీఎంసీ అధికారులతో మాట్లాడాలని రైల్వే అధికారులకి సూచించినట్లు చెప్పారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులతో కలిసి జాయింట్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. మధురానగర్‌లో రైల్వే శాఖతో ముడిపడి వున్న ల్యాండ్ ఇష్యూపై త్వరలో ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి రైల్వే అధికారులు, వీఎంసీ అధికారులతో మాట్లాడతానని అన్నారు. ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 5వ డివిజన్ వాసుల చిరకాల వాంఛగా ఉన్న ఆర్‌యూబీను ప్రారంభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వీరమాచనేని లలిత, కొంగితల లక్ష్మీపతి, టీడీపీ నాయకులు నవనీతం సాంబశివరావు, పీవీఆర్, వీరమాచనేని కిషోర్, దేవరపు మాల్యాద్రి, సింగం వెంకన్న, కెంబూరి కృష్ణ గౌతంప్రసాద్, అంగిరేకుల రాంబాబు, చీఫ్ ఇంజినీర్ శ్రీకాంత్‌రెడ్డి, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఈఈ చంద్రశేఖర్, డిఈఈ గురునాథ్ బాబు, ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బోనస్ ఇవ్వాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):బుడమేరు వరదల్లో విశేష సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులందరికీ ప్రభుత్వం ఒకనెల జీతాన్ని బోనస్‌గా చెల్లించాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సింగ్‌నగర్‌లోని 59వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు ఎంతో శ్రమించారని, వారి కష్టానికి గుర్తింపుగా ప్రభుత్వం వారికి అదనంగా ఒక నెల వేతనాన్ని అందించాలని కోరారు. నిరంతరం కార్మికుల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఎప్పటికప్పుడు పోరాడుతుందన్నారు. కార్మికులు సాధించుకున్న ప్రతి రాయితీలో ఏఐటీయూసీ కృషి ఉందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కె.ఆర్. ఆంజనేయులు, నాయకులు బుద్దె రాజా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జెక్కి జేమ్స్, తుపాకుల నాగేశ్వరారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో నిత్యం రద్దీగా ఉండే బీఆర్‌టీఎస్ రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, ఏలూరు రోడ్డు, రామకృష్ణాపురం, గద్దె వెంకట్రామయ్యనగర్, సత్యనారాయణపురం, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో పశువులు యథేచ్ఛగా సంచరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఆయా రోడ్లలో పశువులు వాహనాలకు అడ్డువస్తుండటంతో వాహనచోదకులు అవస్థలుపడుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు ఢీకొని పశువులు గాయపడుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

అమరవీరుల సంస్మరణ వేడుకల ఏర్పాట్ల పరిశీలన



అమరవీరుల సంస్మరణ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఈనెల 21న నగరంలో జరిగే పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో వీఎంసీ కల్పించే ఏర్పాట్లలో ఎలాంటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఎంజీ రోడ్డులో పర్యటించి పోలీస్ అమరవీరుల సంస్మరణ దిన వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. అక్టోబర్ 21న జరిగే వేడుకల ఏర్పాట్లకు అవసరమైన పార్కింగ్, గ్రౌండ్ అరేంజ్‌మెంట్స్, పెరేడ్ మార్కింగ్ ట్రాక్స్, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, టి.శ్రీనివాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ సురేష్ బాబు, ఇంజినీరింగ్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వ్యవస్థను వ్యవస్థీకృతం చేస్తే పోరు తప్పదు



మాట్లాడుతున్న కార్మికనేత బాలన్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కాంట్రాక్ట్ వ్యవస్థను వ్యవస్థీకృతం చేస్తే పోరు తప్ప మరో మార్గం లేదని కార్మికనేత, కర్ణాటక హైకోర్టు న్యాయవాది బాలన్ అన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను కాపాడడానికి, కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వీటిని లేబర్ కోడ్‌లు అనే కంటే డెకాయిటీ కోడ్‌లు అనడం సముచితంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఉభయ సంఘాల ఆధ్వర్యంలో ఉభయ సంఘాల రాష్ట్ర నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఏసు అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది బాలన్ మాట్లాడుతూ మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వంలో దోపిడీ సాగితే మోదీ ప్రభుత్వంలో బందిపోటు దోపిడీ సాగుతోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని రంగాల్లో రెగ్యులర్ ఉద్యోగ, కార్మికుల సంఖ్య 15 శాతానికి తగ్గితే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఖ్య 85 శాతానికి పెరిగిందన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంక్ విధానాల ప్రయోగశాలగా మారుస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో సమరశీల ఐక్య ఉద్యమాల అవసరం ఎంతో ఉందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.భారతి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు.

శివారు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఆదేశాల మేరకు గుణదల పోలీసులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మధురానగర్ రైల్వేస్టేషన్, గుణదల రైల్వేట్రాక్, శివారు ప్రాంతాల్లో గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను పర్యవేక్షణలో తనిఖీలు చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవిస్తే కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించారు.
గంజాయి సేవించడం, విక్రయించడం చట్టప్రకారం నేరం అని ఎక్కడైనా గంజాయి వినియోగం, విక్రయం జరిగితే పోలీసుల దృష్టికి తీసురురావాలని సూచించారు. అనంతరం పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యుత్ మరమ్మతుల కారణంగా గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్ణానందంపేట, హనుమాన్‌పేట, ఆంధ్ర రత్నరోడ్డు, రైల్వేస్టేషన్, పాత గవర్నమెంట్ హాస్పిటల్, తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంతాల్లో విద్యుత్ నిలిచిపోతుందని వివరించారు.

'సాక్షి' స్పెల్ బీకి విశేష స్పందన



స్పెల్‌బీ పరీక్షకు హాజరైన విద్యార్థులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు నాలుగు కేటగిరీల్లో పరీక్షలు నిర్వహించారు. నాలుగు కేటగిరీల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు 51మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంగ్లిషు భాషలో స్పెల్లింగ్‌లను ఎలా చదవాలి.. ఇంగ్లిషు భాష మాట్లాడేటప్పుడు కొన్ని పదాలు సైలెంట్ అవుతాయి. ఆ పదాలు ఏవీ అనే అంశంపై అవగాహన ఏర్పడిందని విద్యార్థులు తెలిపారు.

ఆక్రమణ తొలగింపునకు చర్యలేవి?



దసరా ఉత్సవాల ముసుగులో నిర్మించిన మందిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దసరా ఉత్సవాల పేరిట 29వ డివిజన్ మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో విలువైన స్థలం కబ్జాకు గురైంది. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పేరిట కాలువగట్టు ప్రాంతంలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి లోపల మందిరం నిర్మించారు. ఈస్థలం కబ్జాకు గురైన వైనంపై 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనంతో స్పందించిన అధికారులు, ఉత్సవాల తర్వాత ఆక్రమణలను తొలగిస్తామని తెలియజేసినప్పటికీ ఆదిశగా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన అధికారులు, వార్డు ప్లానింగ్ సిబ్బంది ఇక్కడ ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలకరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీసాయి సంగీత నృత్య అకాడమీకి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.